

నేడు, రేపు ఎస్‌టి కమిషన్ చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి పాడేరు : ఎస్‌టి కమిషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ డివిజి. శంకరరావు ఈనెల 8, 9 తేదీలలో పాడేరు, అరకువ్యాలీ మండలాలలో పర్యటిస్తున్నారని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. 8న ఉదయం 10 గంటలకు మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకుని, తర్వాత లింగాపుట్టు గ్రామాన్ని సందర్శించి అక్కడ గిరిజనులతో ముచ్చటిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు ఐటిడిఎ సమావేశ మందిరంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులపై అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం.5 గంటలకు అరకువ్యాలి ఎపిటిడిసి అతిధిగృహానికి చేరుకుని, స్థానిక గిరిజన నేతలు, గిరిజన సంఘాల నేతలతో ముచ్చటిస్తారు. 9న ఉదయం 9 గంటలకు మండలంలోని ఒక గిరిజన గ్రామాన్ని సందర్శించి గిరిజనులతో సమావేశ మవుతారు. అనంతరం పు. 11 గంటలకు గిరిజన మ్యూజియంను సందర్శిస్తారు. తిరిగి మ.12.30 గంటలకు అతిధి గహానికి చేరుకుని భోజనం అనంతరం విజయనగరం బయలుదేరి వెళతారు.

రైతు భరోసాను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్
- జిల్లాలో 1,70, 835 మంది రైతులకు రూ.70.76 కోట్ల లబ్ది



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, పిఎం కిసాన్ సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సత్యసాయి జిల్లాలో ప్రారంభించిన ఐదో ఏడాది, రెండో విడత రైతుభరోసా సాయం పంపిణీ ప్రత్యక్ష ప్రసారాన్ని మంగళవారం స్థానికి కాఫీ హౌస్ నుంచి వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,70,835 మంది రైతులకు రూ.70.76 కోట్ల రైతు భరోసా సాయాన్ని నేరుగా వారి ఖాతాలకు జమ చేస్తామన్నారు. దీనికి సంబంధించి నమూనా చెక్కును రైతులకు పంపిణీ చేశారు. అటవీ హక్కుపత్రాలు కలిగిన రైతులకు రైతు భరోసా వస్తున్నది లేనిది రైతులను అడిగి తెలుసుకున్నారు. కాఫీ విక్రయాలపై రైతులను ప్రశ్నించారు. దళారులను ఆశ్రయించకుండా జిసిసి, చింతపల్లి మాక్స్‌సొసైటీకి కాఫీగింజలను విక్రయించాలని సూచించారు.

రాగులుకు మద్దతు ధర ప్రకటన


రాగులు కిలోకు రూ.38.40 మద్దతుధరను ప్రకటించిన ప్రభుత్వం, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల వద్ద కొనుగోలు కేంద్రాలతో కొనుగోలు చేపడుతుందన్నారు. పౌర సరఫరాల శాఖ విక్రయ కేంద్రాలకు తీసుకొస్తే తూకం, ధరలో మోసం లేకుండా కచ్చితమైన ధర పొందవచ్చని, దళారుల బెడద, మోసం ఉండదని సూచించారు.

అనంతరం పట్టు పరిశ్రమల శాఖ, పశుసంవర్ధక శాఖ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, స్పైసెస్ బోర్డు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్సును సందర్శించారు. పట్టు పురుగులు పెంపకం ద్వారా రైతులకు మంచి లాభాలు వస్తున్నాయన్నారు. పశు సంవర్ధక శాఖ సేవలపై గిరిజన రైతులను ప్రశ్నించారు. వెటర్నరీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి సేవలు అందించాలని సూచించారు.

కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి ఎ.రమేష్‌కుమార్ రావు, పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకలు నరసింహం, జిల్లా సెరికల్చర్ అధికారి అప్పారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు మినుముల సరస్వతి, పాడేరు ఎంపిపి ఎస్.రత్నకుమారి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కన్నాపాత్రుడు, మాజీ ఎంపిపి మంగ్లన్న దొర, సర్పంచుల పోరం అధ్యక్షులు చిట్టబాబు మార్కెట్ కమిటీ అధ్యక్షులు పి.సూరిబాబు, పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు మండలాల రైతులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

- హైవే బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించాలి
- జాతీయ రహదారిని ఆనుకుని సర్వీస్‌రోడ్డు నిర్మించాలి
- ఆర్‌టిసి స్థలాల్లో అక్రమ నిర్మాణాలు రద్దు చేయాలి
- ఐటిడిఎ పిఒకు సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స వినతి



ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందజేస్తున్న అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు, ఆస్తులను కోల్పోయిన అల్లూరి జిల్లాలోని ఆదివాసీ నిర్వాసితులకు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స కోరారు. బాధితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మంగళవారం జాతీయ రహదారి భూసేకరణ అధికారి, పాడేరు ఐటిడిఎ పిఒకు వినతి పత్రం అందజేశారు. విజయనగరం నుంచి రాజమండ్రి వరకు నిర్మిస్తున్న ఎన్‌హెచ్156 గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో అల్లూరి జిల్లాలో అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, జికెవీధి, కొయ్యూరు, రాజవొమ్మంగి 11 మండలాల్లో రహదారి నిర్మాణ పనులనుప్రారంభించి 30 శాతం పనులు పూర్తి చేశారన్నారు. రహదారికి ఇరువైపులా ఆదివాసీల జిరాయితీ, అటవీ పోడు భూములు 50 ఎకరాల్లో 1500 కుటుంబాలకు జీవనాధారమైన. కాఫీ తోటలు, వరి, రాజ్మా చిక్కుడు, పసుపు పంటలను ధ్వంసం చేయడంతోపాటు తాగునీటి పైపులైన్లు, ఆలయాలను ధ్వంసం చేశారన్నారు. 2005కు పూర్వం అటవీ ప్రాంతంలో జీవిస్తున్న, సాగుచేస్తున్న ఆదివాసీలకు పది ఎకరాలకు తక్కువ లేకుండా భూములకు వ్యక్తిగత, ఉమ్మడి అటవీ యాజమాన్యపు హక్కును కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని, అయితే అటవీహక్కు పత్రాలు లేవని బలవంతంగా భూములు లాక్కోవడం దారుణమన్నారు.

జికె..వీధి మండలం, పెదవలస పంచాయితీలో నాలుగు గ్రామాలు, సంకడ పంచాయతీలో ఆరు, రింతాడ పంచాయతీలో నాలుగు, జి.మాడుగుల మండలం ముల్మట్టు గ్రామం, వంజరి పంచాయతీ చిన్న కాంద్రగడ్డ, కొయ్యూరు మండలంలోని కొన్ని గ్రామాల్లో దాదాపు 70మంది ఆదివాసీ గిరిజనులు రోడ్డు నిర్మాణంలో సాగుభూమి కోల్పోయినా వారికి పరిహారం చెల్లించలేదన్నారు. దీనిపై ఆయా ప్రాంతాల్లోని బాధిత గిరిజనులు సిపిఎం ప్రజారక్షణ భేరి బృందానికి వినపత్రాలు ఇచ్చారని పిఒకు వివరించారు.

5వ షెడ్యూల్ ఏరియాలో భూసేకరణకు ఆదివాసీ గ్రామసభ, పీసా అభిప్రాయం, ఆమోదం తీసుకోలేదని, అటవీ హక్కుల కమిటీ (ఎఫ్ఆర్‌సి) తీర్మానం కూడా లేకుండా వందలాది ఎకరాల కాఫీ తోటలు, పచ్చని చెట్లను తొలగిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు.నిర్వాసితుల వివరాలను పంచాయతీ, సచివాలయ కేంద్రాల్లో ప్రదర్శించ లేదన్నారు. ఆదివాసీల నుంచి దౌర్జన్యంగా భూములు లాక్కొన్న అధికారులపై చర్యలు చేపట్టాలని, బాదితులకు అటవీహక్కు చట్టం ప్రకారం పోడు వ్యవసాయానికి భూమి కేటాయించాలని, తక్షణమే గ్రామసభ నిర్వహించి, నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. హైవే పొడుగునా సర్వీస్‌రోడ్డు నిర్మించాలని కోరారు

ఆర్‌టిసి టెండర్లు రద్దు చేయాలి

ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలకు వ్యతిరేకంగా పాడేరు అర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో షాపింగ్ మాల్స్ నిర్మాణానికి అడ్డగోలుగా నిర్వహించిన టెండర్ రద్దు చేయాలని అప్పలనర్స కోరారు. దీనిపై పిఒ స్పందిస్తూ, ఆర్‌టిసి కాంప్లెక్స్‌లోని నిర్మాణాల నిలుపుదలకు ఆదేశాలిస్తామన్నారు. పిఒను కలిసిన వారిలో జిల్లా నాయకులు దాస్, నిరుద్యోగులు ఎల్. లింగమూర్తి, మాణిక్యం, దుమన్ పాల్గొన్నారు.



రిజర్వాయర్ నీటి నిల్వలను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ శ్రీధర్, అధికారులు

15 రోజుల్లో నాలుగో యూనిట్ మరమ్మతులు

- ఎపి జోన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ శ్రీధర్

ప్రజాశక్తి-సీలేరు

సీలేరు జల విద్యుత్ కేంద్రంలో నాలుగో యూనిట్ మరమ్మతు పనులు మరో 15 రోజుల్లో పూర్తిచేసి అందుబాటులో తీసుకొస్తామని ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ తెలిపారు. జీకే వీధి మండలం సీలేరు జలవిద్యుత్ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి నాలుగో యూనిట్ మరమ్మత్త పనులను పరిశీలించారు. యూనిట్ మరమ్మతులు శరవేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఈఈ లక్ష్మీనారాయణను ఆదేశించారు. స్థానిక రెగ్యులేటరీ డ్యాము రెండు, మూడు, ఆరు గేట్లు రబ్బర్ సీల్స్ అరిగిపోవడంతో గేట్లు కింద భాగం నుంచి నీరు లీకేజీని అరికట్టేందుకు గేట్లకు కొత్త రబ్బరు సీల్స్ అమర్చే పనులను చీఫ్ ఇంజనీర్ పరిశీలించారు. సంబంధిత కాంట్రాక్టర్ చేపడుతున్న గేట్లు మరమ్మతు పనులలో నాణ్యత లోపాలు తలత్తకుండా ఎప్పటికప్పుడు పరివేక్షించాలని సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈ ప్రభాకర్‌ను ఆదేశించారు. మెయిన్ డ్యామ్, రెగ్యురేటరీ డ్యామ్ పైన విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. సీలేరు రిజర్వాయర్లో నీటి నిల్వాలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మోతుగూడెం ఓ అండ్ డ్యామ్ ఎస్ఇ వెంకటేశ్వరరావు, డిఈ టెక్నికల్, ఈఈలు బాలకృష్ణ, ప్రభాకర్, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ కులధ్రువీకరణపై సమగ్ర విచారణ

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్



మాట్లాడుతున్న బుజ్జిబాబు

ప్రజాశక్తి- అరకురూరల్ : నకిలీ ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రం పొందిన గిరిజనేతరుడుపై క్రిమినల్ కేసు పెట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు బుజ్జిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆధివాసీ గిరిజన సంఘం భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఒడిశా నుంచి బతుకు తెరువు కోసం వచ్చి, మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ బంగలవలస గ్రామంలో నివాసం ఉంటున్న గిరిజనేతరుడైన కార్తీక రాజకిరణ్‌కు ఎస్‌టి కులధ్రువీకరణ జారీ చేశారని ఆరోపించారు

పట్టా ఉందని దౌర్జన్యంగా గ్రామకంఠం భూమిని కబ్జా చేశారని, ప్రశ్నించిన గిరిజనులపై కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కబ్జాపై ప్రశ్నించిన కొర్ర శంకరరావు, కొర్ర చిట్టి బాబు, పాంగి రాజారావు, పాంగి అంజిరావు, కొర్ర సింహాచలం, పాంగి రామారావు, కొర్ర అమర్ సాయి, కొర్ర బొంజోలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేయాలని కోరారు. లేకుం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు కె. నర్సయ్య, మండల నాయకులు కె బుజ్జిబాబు , జి చిన్నబాబు, టి జోషి, గ్రామస్తులు కె చిట్టి బాబు, కొర్ర శంకరరావు, బొంజు, కొర్ర సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన పశుబీమా పథకం

- నాలుగేళ్లుగా అందని పరిహారం

ప్రజాశక్తి కొయ్యూరు

వ్యాధులతో పశువులు చనిపోతే బాధిత రైతులను ఆదుకొనేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పశు బీమా పథకం అటకెక్కింది. నాలుగేళ్ల నుండి బాధిత రైతులకు బీమా సొమ్ము జమ కాకపోవడంతో అసలు ఆ పథకం ఉందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొయ్యూరు మండలం పరిధిలో అనేక రకాల వ్యాధులతో 90కి పైగా పాడి గేదెలు మరణించగా, ఆ వివరాలను అంతర్జాలంలో నమోదు చేసినట్లు వెటర్నరీ వైద్యులు తెలిపారు. అయితే ఇంతవరకు ఎవరికీ పశునష్టపరిహారం అందినట్లు సమాచారం లేదని వెటర్నరీ వైద్యులు చెప్పారు. పశుబీమా పరిహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, నాలుగేళ్లగా నుండి ఇవ్వలేదని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. చిన్న సన్న కారు రైతులను ప్రభుత్వ సకాలంలో ఆదుకోవాల్సి ఉండగా ఈ బీమా పథకం అమలులో ఉన్నది లేనిది తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి మండలంలో పశు బీమా చెల్లించి పాడి రైతులను ఆదుకోవాలని పలువురు గిరిజన పాడి రైతులు వేడుకుంటున్నారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ ప్రచార ఉద్యమం ప్రారంభం

ప్రజాశక్తి- అరకు లోయ :ఆల్ ఇండియా పీపుల్ సైన్స్ నెట్ వర్క్, జనవిజ్ఞాన వేదిక పిలుపు మేరకు అరకు లోయ ఎపి బాలుర రెసిడెన్షియల్ కళాశాలలో దేశవ్యాప్త సైన్స్ ప్రచార ఉద్యమం ప్రారంభమైంది. మంగళవారం అల్లూరి జిల్లా జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి యండమూరి పారయ్య అధ్యక్షతన జరిగిన కార్యాక్రమంలో ఆయన మాట్లాడుతూ, సివి. రామన్, మేడమ్ క్యూరీ జయంతిని పురస్కరించుకొని వచ్చే ఫిబ్రవరి 28 వరకు శాస్త్ర ప్రచార ఉద్యమంలో భాగంగా ప్రజల్లో మూఢాచారాలను రూపుమాపి, శాస్త్రీయ ఆలోచన పెంపొందించే విధంగా ప్రజా చైతన్యకార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి, సైన్స్ సంబరాల పేరుతో విద్యార్థులకు పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి హెచ్ లక్ష్మణుడు, వైస్ ప్రిన్సిపాల్ యన్ పద్మ పాల్గొన్నారు.

సమ్మె బాటలో టూరిజం కార్మికులు



సమావేశమైన టూరిజం కార్మికులు

ప్రజాశక్తి - అనంతగిరి: పదిరోజుల్లో సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రెండు,మూడు రోజుల్లో పర్యాటక ప్రదేశాలను మూసేసి సమ్మె బాట పడతామని టూరిజం కార్మికులు హెచ్చరిస్తున్నారు. అనంతగిరి మండలం ట్రైడా యూనిట్లో పనిచేస్తున్న కార్మికులు మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు ఈ సందర్భంగా టూరిజం కార్మికుల యూనియన్ అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు గుజ్జలి గురు మాట్లాడుతూ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని గత నెలలో సమ్మెకు పిలుపునిస్తే, టూరిజం శాఖ యాజమాన్యం, ప్రభుత్వం తరపున ఎమ్మెల్సీ కుంభా రవిబాబు చొరవ చూపి, అనంతగిరి ఎంపిటిసి దీసరి గంగరాజు సమక్షంలో జరిగిన బహిరంగ చర్చల్లో పది రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని, అయితే గడువు దాటినా వాటిని అమలు చేయడం లేదన్నారు. దీంతో తాము ముందుగా నిర్ణయించిన ప్రకారం సమ్మెకు సిద్ధమౌతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు బాలకష్ణ, ఎర్రిబాబు, కాసులమ్మ లక్ష్మి పాల్గొన్నారు

దళారులకు విక్రయించి మోసపోవద్దు

- కాఫీ రైతులకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచన

ప్రజాశక్తి -పాడేరు: కాఫీ ఫలసాయాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని గిరిజన కాఫీ రైతులకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. కాఫీ కొనుగోళ్లు, విక్రయాలపై మంగళవారం విడుదల చేసిన ప్రకటనలోకాఫీకి డిసెంబరు, జనవరి నెలలో మంచి ధర పలుకుతుందని, అంతవరకు రైతులు వేచి ఉండాలని సూచించారు.

కిలో రూ.150 లు, రూ.155 లకు విక్రయించడం వలన రైతులు నష్టపోతున్నారన్నారు. రూ.300 ధర వచ్చినపుడు విక్రయించాలని చెప్పారు. ఈ ఏడాది కాఫీ పండ్లకు ఐటిడిఎ రూ.43 ధర ప్రకటించిందన్నారు. కాఫీ పళ్లను సరఫరా చేసిన వారం రోజుల్లో రైతులకు డబ్బులు చెల్లిస్తారన్నారు. ఎపల్పింగ్ చేసి విక్రయించగా వచ్చిన లాభాన్ని తిరిగి రైతులకు బోనస్‌గా పంపిణీ చేస్తామన్నారు. గత ఏడాది కాఫీ పళ్లను రూ.36లకు కొనుగోలు చేసి, అనంతరం రూ.ఎనిమిది బోనస్ గా రైతులకు చెల్లించారని గుర్తు చేశారు. వ్యాపారులు, దళారులకు విక్రయించే సమయంలో తూకం, ధరలో రైతులు మోసపోయే అవకాశం ఉన్నందున, మాక్స్ సంస్థకు మంచి ధరకు విక్రయించాలని సూచించారు.

మంచినీళ్ల కష్టాలు తీర్చండి

ప్రజాశక్తి-ఎటపాక

మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధి మాధవరావుపేటలో తాగడానికి నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ గ్రామంలో మంచినీళ్ల కష్టాలు తీర్చాలని సిపిఎం మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు (ఐవి) డిమాండ్ చేశారు. గ్రామంలో తాగునీటి సమస్యపై గ్రామస్తులు సిపిఎం దృష్టికి తీసుకురాగా, మంగళవారం ఐవి, ఇతర నాయకులు గ్రామాన్ని సందర్శించారు. తమ గ్రామంలో జల్ జీవన్ మిషన్ పేరుతో పైపులైన్లు వేసి మంచినీటి కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారని, ఇప్పటికే ఉన్న ట్యాంకు నుండి కొన్ని కుటుంబాలకు కనెక్షన్ ఇచ్చారని గ్రామ గిరిజనులు తెలిపారు. కాని చాలా కుటుంబాలకు కనెక్షన్ ఇవ్వకుండా వదిలేయడం వల్ల, వారికి నీటి సరఫరా లేక మంచినీళ్లు రాక ఉన్న బోర్లు కూడా సరిగా పనిచేయక తాగునీటి కొరకు చాలా కష్టాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పని చేసుకుని పొద్దుపోయిక వచ్చేసరికి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న తమ పరిస్థితిని సిపిఎం నాయకులకు వివరించారు. దీంతో సిపిఎం గ్రామాన్ని సందర్శించిన సిపిఎం నాయకులు మంచినీటి కష్టాలను తొలగించడం కొరకు అక్కడి నుండే పంచాయతీ సెక్రెటరీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలతో మాట్లాడారు. కానీ వారి నుండి స్పష్టమైన హామీ రాలేదు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఐవి మాట్లాడుతూ అధికారులు మాధవరావుపేట గ్రామాన్ని వెంటనే సందర్శించి గిరిజన ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం స్థానిక నాయకులు కాకా వెంకటేశ్వర్లు, అప్క శ్రీను, కనితి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కనెక్షన్ ఇవ్వని తాగునీటి పైపులైన్‌ను పరిశీలిస్తున్న సిపిఎం నేత ఐవి, గిరిజనులు



మహిళలకు కరపత్రాలు అందిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సంక్షేమ పథకాలతోనే పేదల అభివృద్ధి

ప్రజాశక్తి-కొయ్యూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే పేదల జీవితాల్లో అభివృద్ధి కనిపించిందని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కితాబు గ్రామంలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న భాగ్యలక్ష్మి 60 గడపలను సందర్శించి సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందుతున్న ఆర్థిక సాయాన్ని వివరించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు తెలియజేసిన సమస్యలను కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఇరువాడ రత్నకుమారి, ఎంపిటిసి లోకుల సోమగాంధీ, ఎంపీపీ బడుగు రమేష్, వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ జైతి రాజులమ్మ, జెసిఎస్ మండల కన్వీనర్ బండి సుధాకర్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు గొడ్డేటి మహేష్, సర్పంచులు రాజేశ్వరి, పొట్టిక శ్రీను, కొడ రాజబాబు, ఎంపీటీసీ మల్లేశ్వరి, వైసిపి నాయకులు దొని బాబ్జి, అప్పన గజ్జయ్య దొర, సడ్డ సావిత్రి, రేముల గంగాధర్, ఇరువాడ సత్యనారాయణ, గాడి సత్యనారాయణ, తిరుపతి, పాటి శేఖర్, రామరాజు, నానాజీ, గాడి అచ్చిరాజు, వనం బాబు, అధికారులు పాల్గొన్నారు.

జికె.వీధిని కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, గిరిజన రైతులను ఆదుకోవాలని గిరిజన సంఘ నాయకులు మార్కు రాజు డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ బొరుకులగొంది, కనుసమెట్ట, నేలజర్త గ్రామాల్లోని పంట పొలాల్లో గిరిజనులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి, మినప పంట చేతపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మార్కు రాజు మాట్లాడుతూ ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడక ఎండకు పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోకపోతే తిరిగి గంజాయి పంటల వైపు మొగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షాలు లేకపోవడంతో రాజ్‌మా, చిక్కుళ్ళు, మినుములు, సాములు, కొర్రలు, అలుసులు తదితర పంటలు ఎండిపోయినట్లు చెప్పారు. సీలేరు యూనియన్ బ్యాంకులో రుణాలు పొందిన గిరిజన రైతులందరికీ రుణమాఫీ తక్షణమే ప్రభుత్వం చేయాలని డిమాండ్ చేశారు. ఏ కార్యక్రమంలో దుప్పులవాడ మాజీ సర్పంచ్ అల్లంకి రాజు, కాంగ్రెస్ నాయకులు మల్లుదొర, రాంబాబు, గిరిజనులు పాల్గొన్నారు.



మినుముల పొలంలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రభుత్వ జూనియర్ కళాశాల సందర్శన

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ అప్పల రాము మంగళవారం సందర్శించారు. కళాశాల నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. సిఈసి, హెచ్ఈసి తరగతి గదులను సందర్శించి విద్యాభ్యాసంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకున్నప్పుడు ఉన్నత శిఖరాలను అంది పుచ్చుకోవచ్చునని సూచించారు. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి కళాశాలకు మంచి పేరు తేవాలని కోరారు. అనంతరం జూనియర్ కళాశాల ఆఫీస్ రూములో లెక్చరర్లతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసు, సివిక్స్ లెక్చరర్ బి.సూర్యనారాయణ, గెస్ట్ ఫ్యాకల్టీ ఇస్మాయిల్ సత్తిబాబు, తలుపులయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఐఇఒ అప్పల రాము

ప్రజా రక్షణభేరి పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-చింతూరు : బిజెపి పాలనలో లౌకికవాదం ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, దాని పరిరక్షణ, దేశవ్యాప్తంగా అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రజా రక్షణ భేరి చేపట్టినట్లు సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ తెలిపారు. ప్రజా రక్షణ భేరి సందర్భంగా ఈ నెల 15న విజయవాడలో జరుగు మహా ప్రదర్శన బహిరంగ సభలో ప్రజానీకం అత్యధికంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మంగళవారం ఎర్రంపేట గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీసం సురేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి రాష్ట్రంలోని తెలుగుదేశం, వైసీపీలు, ప్రజలకు అబద్ధపు వాగ్దానాలతో కాలం వెళ్ళదీస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పల్లపు వెంకట్, కారం అరుణ్, కారం సుందరయ్య, పాండు నాగు, రాజు, సుబ్బారావు, రాజయ్య, ఇతరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చలో ఐటిడిఎ

24 నుంచి సిహెచ్‌డబ్ల్యుల రిలే దీక్షలు


పాడేరులో వైద్యాధికారి గోపాలకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

ప్రజాశక్తి - యంత్రాంగం

పాడేరు: సమస్యల పరిష్కారానికి ఈనెల 24 నుంచి ఐటిడిఎ వద్ద రిలే దీక్షలు చేపడతామని సిహెచ్డబ్ల్యులు వెల్లడించారు. మంగళవారం ఈదులపాలెం, మినుములూరు పిహెచ్‌సిల సామాజిక ఆరోగ్య కార్యకర్తలు వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

ఏడేళ్లుగా గ్రామాల్లో పనిచేస్తున్న సిహెచ్‌డబ్ల్యులను ఆశవర్కర్లుగా గుర్తించాలని, వారితో సమానంగా వేతనం చెల్లించాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులు బేఖాతరు చేయడం సరికాదన్నారు. జిల్లాలో 36 పిహెచ్‌సి పరిధిలోని 750 మంది సిహెచ్‌డబ్ల్యులను ఆశ వర్కర్లుగా గుర్తించాలని, ఖాళీగా ఉన్న 53 పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు దీనిపై జిల్లా అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించిన తమ పరిష్కారం కావడంలేదని సిహెచ్ డబ్ల్యూ వాపోయారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ మంగమ్మ దాసమ్మ వివిధ గ్రామాల సిహెచ్డబ్ల్యులు పాల్గొన్నారు.

చింతపల్లి: సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా గుర్తింపు, సమాన పనికి సమాన వేతనం, ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24న సిహెచ్‌డబ్ల్యుల చలో ఐటిడిఎ ఆందోళనను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు పాంగి ధనుంజయ్ కోరారు మంగళవారం మండలంలోని తాజంగి, లంబసింగి పిహెచ్‌సిల్లోఆశాలు, సిహెచ్‌డబ్ల్యులతో కలిసి వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో లంబసింగి, తాజంగి పిహెచ్‌సిల ఆశా, సిహెచ్‌డబ్ల్యుల యూనియన్ నాయకులు వి లక్ష్మీ, శిరోమణి, కె సింహాచలం, భానుమతి, చెల్లాయమ్మ, బాలమ్మ, కుమారి, జె గంగ పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: సిహెచ్‌డబ్ల్యుల సమస్యల పరిష్కారానికి ఈనెల 24న నిర్వహించే చలో ఐటిడిఎ విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర శంకరరావు కోరారు. మంగళవారం స్థానిక సిహెచ్‌సిలో కిలగడ, లబ్బూరు పిహెచ్‌సిల ఆశావర్కర్లు, ని హెచ్ డ బ్ల్యుల సమావేశంలో పాల్గొన్నారు. సిహెచ్‌డబ్ల్యుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కిలగాడ పిహెచ్‌సి వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను, ఆశాలు కొర్ర శాంతమ్మ, సుభద్ర, రీతమ్మ, కొర్ర పుల్మొని పాల్గొన్నారు.

కొయ్యూరు: ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల (సిహెచ్‌డబ్ల్యు) సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వై.అప్పలనాయుడు, గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎస్ సూరిబాబులు డిమాండ్ చేశారు. మండలంలోని కంఠారం, రాజేంద్ర పాలెం , డౌనూరు పిహెచ్‌సిల వైద్యాధికారులకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు, సూరిబాబు మాట్లాడుతూ సిహెచ్‌డబ్ల్యులను ఆశా వర్కర్లగా ప్రమోట్ చెయ్యాలని, రూ.10వేలు వేతనం ఇవ్వాలని, యూనిఫామ్, సెల్ ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిహెచ్‌డబ్ల్యుల సమస్యల పరిష్కారం కొరకు నవంబర్ 24వ తేదీన చలో పాడేరు కార్యక్రమానికి సిహెచ్‌డబ్ల్యులు హాజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమాల్లో సంఘం నాయకులు బి.అచ్చియమ్మ, బి.లక్ష్మి, జి.లక్ష్మి, త్రివేణి, రత్న కుమారి, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : సిహెచ్‌డబ్ల్యులకు ఆశ వర్కర్లగా తక్షణమే ప్రమోషన్ కల్పించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం పెద్దవలస ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ కమ్యూనిటీ వర్కర్స్ సమావేశాన్ని నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. ఈనెల 24వ తేదీ చలో పాడేరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆశా, సిహెచ్‌డబ్ల్యులకు పిలుపునిచ్చారు. రూ.10వేలు జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పంద్ర ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.


చింతపల్లిలో వినతిపత్రం అందిస్తున్న సిహెచ్‌డబ్ల్యులు


కొయ్యూరులో....


జికె.వీధి మండలం పెద్దవలసలో....


ముంచంగిపుట్టులో....


రమేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

కార్మిక నేత రమేష్‌కు ఘననివాళి

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: కార్మిక కర్షకుల పెన్నిధి ప్రజా మనిషి కామ్రేడ్ ఎస్ రమేష్ 6వ వర్ధంతిని మంగళవారం అరకువేలి ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. రమేష్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్స తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ.ఏజెన్సీలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, గిరిజన కార్మికుల హక్కులకు, ఐటిడిఎ స్కీమ్ వర్కర్స్ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేసి, తన జీవితాన్ని రమేష్ త్యాగం చేశారని కొనియాడారు.ఆదివాసీ గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై గళం విపిన రమేష్ ఆశయాల సాధనకు, గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం పటిష్ట అమలు, కనీస వేతనాలు అమలుకు, ఇతర సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఆదివాసి గిరిజన మహిళలపైనా, గిరిజన హక్కులపై దాడులు పెరుగుతున్న వేళ పోరాటం తీవ్రతరం చేయాలన్నారు. మన్యవాసులకు విద్యా, వైద్యం అందరిని ద్రాక్షగా మారిందని, భవిష్యత్తులో ఎస్.రమేష్ స్ఫూర్తితో గిరిజన ప్రాంత రక్షణకు పోరాటానికి ఆదివాసి గిరిజనులందరూ నడుంబిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ధీసారి గంగరాజు (అనంతగిరి జడ్పిటిసి)కిండంగి రామారావు,జిల్లా కమిటీ సభ్యులు ఎస్ బిపోతురాజు ,జి చినబాబు,సురేష్, ,బుజ్జి, బాలక్రిష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు గంగరాజు, పి అప్పలనర్స , రామారావు, పోతురాజు పాల్గొన్నారు.

బంద్ జయప్రదానికి ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి

ప్రజాశక్తి-పెదబయలు : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, ఏజెన్సీలో జిఒ 3 పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 8న బుధవారం చేపట్టే విద్యాసంస్థల రాష్ట్రవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నేతలు కోరారు. ఈ మేరకు పలువురు విద్యాసంస్థల యాజమాన్యాలను కలిసి విజ్ఞప్తి చేశారు. బంద్‌కు సహకరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై నిరుద్యోగయువత, విద్యార్థులను మేల్కొలపడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు వెల్లడించారు. విద్యాసంస్థల బంద్‌కు ప్రభుత్వ కార్యాలయాలు సంఘీభావం ప్రకటించి బంద్ పాటించాలని కోరారు.

ప్రమాదభరిత విద్యుత్ స్తంభాలను తొలగించండి

ప్రజాశక్తి - చింతపల్లి: గ్రామంలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తక్షణమే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. స్థానిక ముతాదారి వీధిలోనూ, అదే విధంగా సాయినగర్ వీధి, ఇలా పలు చోట్ల పాత ఇనుప విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరి, ఒక వైపుకు ఒరిగిపోయి గాలులకు కూలిపోయే విధంగా భయంకరంగా ఉన్నాయని, మరోవైపు పట్టుకుంటే షాక్ కొట్టే ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రమాదభరిత స్తంభాలను తొలగించాలని అనేక విధాలుగా మొరపెట్టుకున్నా అధికారులు స్పందించడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఏదైనా ప్రాణాపాయ ప్రమాదం జరగకముందే శిథిలావస్థలో ఉన్న స్తంభాలను శాశ్వతంగా తొలగించాలని ఆయా ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభం

బిర్సా ముండా జయంతిని జయప్రదం చేయండి


ప్రజాశక్తి-చింతపల్లి : ఈనెల 14,15 తేదీల్లో పాడేరులో బిర్సాముండా 149వ జయంతిని జయప్రదం చేయాలని ఎపి ఆదివాసీ జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం చింతూరులో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బిర్సాముండా జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ ఆదివాసీ సదస్సు, సాంసతిక కళా ప్రదర్శనలను విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు, సభ్యులు బౌడు గంగారాజు, గెమ్మెల మోహనరావు, దేపూరి శశికుమార్, లోచెల చిట్టినాయుడు, గెమ్మెల కామేశ్వర్రావు, గోపినాథ్, వీరభద్రరావు, సతీష్, చందు, చిన్నయ్యపడాల్ పాల్గొన్నారు.

9న టిడిపి మండల సమావేశం

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: ఈనెల 9న మండల కేంద్రంలో టిడిపి మండల కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి సుబ్బారావు తెలిపారు. ఈ సమావేశానికి మండల బూత్ కన్వీనర్లు, మండలానికి సంబంధించి రాష్ట్ర, జిల్లా, పార్లమెంట్ నియోజకవర్గంలో వివిధ పదవుల్లో ఉన్న పార్టీ నాయకులతోపాటు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి సమిష్టి పోరాటం

ప్రజాశక్తి- అనంతగిరి: జిపిఎస్, నూతన విద్యా విధానం రద్దు, పాత పింఛన్ విధానం అమలు, బకాయిలు, పిఎఫ్ రుణాలు, ఇఎల్ బిల్స్ తదితర సమస్యలు పరిష్కరించే వరకు సమిష్టి పోరాటం చేయాలని యుటిఎఫ్ నేతలు పిలుపునిచ్చారు. మండలంలోని టోకూరు పంచాయతీ ములియగూడ గ్రామం వద్ద మంగళవారం యుటిఎఫ్ అల్లూరి జిల్లా సహాధ్యక్షులు శెట్టి రాంబాబు, మండల అధ్యక్షుడు వివి ఈశ్వరరావు ఆధ్వర్యాన మండల కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పుడిగి దేముడు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై యాప్‌ల భారం మోపడం సరికాదన్నారు. 107 జిఒను తక్షణమే రద్దు చేయాలని, కొత్త డిఎస్‌సి ప్రకటించాలని, ప్రతినెలా ఒకటో తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని, బడి లేని గ్రామాలకు పాఠశాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బిడ్డ, సింహాచలం, అలాగే కనక మహాలక్ష్మి విజయకుమార్, ప్రకాష్ ,ప్రసాద్, మల్లేశ్వరరావు ,అర్జున్, రామసుందర్ పాల్గొన్నారు


మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా నేత


సమావేశానికి హాజరైన ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు

గృహ ప్రసవాలు అరికట్టేందుకు చర్యలు

ప్రజాశక్తి - సీలేరు : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు గృహ ప్రసవాలు అరికట్టే దిశగా సిబ్బంది పనిచేయాలని స్థానిక వైద్యాధికారి డాక్టర్ సౌమ్య ఆదేశించారు. జీకే వీధి మండలం సీలేరు పిహెచ్సిలో సిబ్బంది, ఆశా కార్యకర్తలు అంగన్వాడీ కార్యకర్తలతో మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సౌమ్య మాట్లాడుతూ దినచర్యలో భాగంగా ప్రతిరోజూ అదనపు లక్ష్యాల్ని అధిగమించే దిశగా పనిచేయాలన్నారు. శ్వాస కోస వ్యాధులు నియంత్రణ, ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకాలపై అవగాహన కల్పించారు. స్టాప్ మిస్ పోర్టల్‌లో మహిళా సాధికారిక గర్భిణులకు సాంఘిక సాంస్కృతి మరియు ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించాలని కోరారు. పిహెచ్సి పరిధి గ్రామాల్లో సందర్శించి గర్భిణులకు పౌష్టికాహారంపైనా, పారిశుధ్యంపైనా పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి ఎంపీహెచ్ఈఓ కే.జ్యోతి బాబు, హెల్త్ సూపర్వైజర్ల బాలమణి త్రినాధ, హెచ్‌వి డి.వరలక్ష్మి, ఎస్ కుపేంద్ర, ఏఎన్ఎంలు బి.దేవి, ఎం.అరుణ్ కుమారి, కేవిఎన్ కుమారి, వైద్య సిబ్బంది, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధం

ప్రజాశక్తి - అడ్డతీగల : మండల కేంద్రంలో మంగళవారం పిడుగు పడి కొబ్బరి దగ్ధమైంది. మంగళవారం వారపు సంత జరుగుతున్న సమయంలో సాయంత్రం 4.30 గంటలకు ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో పెద్ద శబ్ధంతో పిడుగు చిప్పల రాంబాబు ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై పడడంతో కొబ్బరి చెట్టు కాలిపోయింది. అయితే ఎవరికి కూడా ప్రాణహాని కలగలేదని, ఆ ఏరియాలో ఉన్న కొంతమంది ఇళ్లలోని ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయని స్థానికులు తెలిపారు.

నేడు నాలుగు మండలాలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - రంపచోడవరం : జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఈ నెల 8 బుధవారం, 10వ తేదీ శుక్రవారం గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ ఎమ్‌డి.యూసఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రోజుల్లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం గ్రామంలోని సీతంశెట్టి నగర్ వద్ద నాలుగు రోజుల క్రితం ఓ అనాథ మృతి చెందగా, విషయం తెలుసుకున్న రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకొని అనాథ శవానికి పంచాయితీ సిబ్బంది చేత అంత్యక్రియలు చేయించారు.

వాలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కొయ్యూరు

కొయ్యూరు మండలంలో ఖాళీగా ఉన్న 4 గ్రామ వాలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో సీతయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్రపాలెం పంచాయతీలో 2, రేవళ్లలో 1, మూలపేటలో 1 చొప్పున 4 ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి ఉన్నవారు ఈనెల 10వ తేదీ లోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 14న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, వివరాలకు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఉక్కు పోరాటం @ 1000 రోజులు

నేడు విద్యాసంస్థల బంద్
కూర్మన్నపాలెం కూడలిలో మహాదీక్ష - జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సభ
మద్దతు తెలిపిన వామపక్షాలు, ప్రజా సంఘాలు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ప్రజాశక్తి - ఉక్కునగరం, కలెక్టరేట్

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే దీక్షలు బుధవారానికి వెయ్యి రోజులకు చేరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్లాంట్ పరిరక్షణ డిమాండ్‌తో విద్యార్థి, యువజన సంఘాలు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కూర్మన్నపాలెం కూడలి వద్ద మహా దీక్ష చేపట్టనుంది. వామపక్షాలు, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన బుధవారం ఉదయం 10 గంటలకు ద్వారకా బస్ కాంప్లెక్స్ చెంత మానవహారం, ఆ తరువాత జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ ప్రదర్శన, అనంతరం సభ నిర్వహించనున్నారు. ఆయా కార్యక్రమాలకు సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్ష పార్టీలు, సిఐటియు, ఎఐటియుసి, ఇతర కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. బంద్‌ను జయప్రదం చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మంగళవారం ఓ ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కు మెయిన్ గేటు వద్ద మానవహారం

కూర్మన్నపాలెం కూడలి వద్ద తలపెట్టిన దీక్షలు మంగళవారానికి 999వ రోజుకు చేరుకున్నాయి. స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, కో - కన్వీనర్లు జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ ప్రజల సంపదని, దీన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం దారుణమని అన్నారు. ఉక్కు దీక్షలు బుధవారానికి వెయ్యి రోజులకు చేరుకుంటున్న నేపథ్యంలో కూర్మన్నపాలెం కూడలిలో మహా దీక్ష చేపట్టనున్నామన్నారు. దీనిలో వేలాదిగా ఉక్కు కుటుంబాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నేతలు కెఎస్ఎన్.రావు, యు.రామస్వామి, బిఎమ్‌కె.నాయక్, జె.రామకృష్ణ, వైటి.దాస్, దొమ్మేటి అప్పారావు, సన్యాసిరావు, బొడ్డు పైడిరాజు, విల్లా రామ్మోహన్ కుమార్, కామేశ్వరరావు, వై.మస్తానప్ప, కె.పరంధామయ్య పాల్గొన్నారు.

ఎండిపోయిన వరి

పశుగ్రాసానికీ పనికిరాని వైనం - ఆర్థిక ఇబ్బందుల్లో రైతులు

ప్రజాశక్తి - పద్మనాభం : విశాఖ జిల్లా పద్మనాభం మండలంలోని పెంట, కొవ్వాడ, గంధవరం, చిన్నాపురం, ఐనాడ, కోరాడ గ్రామాల్లో ఈ ఎడాది ఖరీఫ్‌లో వేసిన వరి పంట పూర్తిగా ఎండిపోయింది. పశుగ్రాసానికి కూడా పనికి రాని విధంగా మారింది. వరి పంట పొట్ట దశకు వచ్చిన సమయానికి పూర్తిగా వర్షాలు లేకపోవడంతో నీరు ఆందక పూర్తిగా ఎండిపోయింది. రైతులు ఎకరానికి ట్రాక్టర్‌తో దమ్ముకు రూ.4 వేలు, ఒక డిఎపి బస్తాకు రూ.1400, యూరియా బస్తాకు రూ.300, పొటాష్ 20 కేజీలకు రూ.600 ఖర్చు పెట్టి వరి నాట్లు వేశారు. అదికాకుండా వరినాట్లు వేసేందుకు ఎకరానికి రూ.4 వేలు, గట్టులకు పార పనులకు, ఆకు తీయడానికి మరో రూ.4 వేలు ఖర్చు చేశారు. నాట్లు వేసిన 25 రోజులకు ఒక యూరియా బస్తాను రూ.300కు కొని వేశారు. తర్వాత అగ్గితెగులు, దోమకాటు, సుడిదోమ తదితర తెగుళ్లు ఆశించడంతో నివారణకు మూడు నుంచి ఐదు సార్లు మందులు పిచికారీ చేశారు. ఒక సారి మందు పిచికారీ చేయడానికి సుమారుగా రూ.2 వేలు నుంచి రూ.2500 వరకు ఖర్చు అయింది. ఇంత ఖర్చు పెట్టాక చివరల్లో వర్షాలు లేక పంటలు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంటిలో ఉన్న బంగారం తాకట్టు పెట్టి, క్రాప్ లోన్లు వాడి మదుపులు పెట్టి వరినాట్లు వేశామని, ఇప్పుడు పూర్తిగా ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆర్‌బికెల ద్వారా పంటల గ్యారెంటీ ఇస్తూ పంట నమోదు చేపట్టినప్పటికీ ఎండిన పంటలను గుర్తించే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. ప్రభుత్వ ప్రచారాలు నీటి మూటలుగానే మిగులుతున్నాయని చెబుతున్నారు.


కొవ్వాడలో ఎండిన వరిపొలం


రోడ్డు మలుపులో ఉన్న కలప దుంగలు

రోడ్డుకు అడ్డంగా కలప దుంగలు

- వాహనదారులకు ఇబ్బందులు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో అరకు పాడేరు ప్రధాన రోడ్డు చాపరాయి జలపాతానికి సమీపంలో మలుపు వద్ద రోడ్డుపై ఉన్న కలప దుంగలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కలప వ్యాపారులు వాటిని కొనుగోలు చేసి వాహనాల్లో తరలించే క్రమంలో మలుపు వద్ద ఇవిరోడ్డుపై పడిపోయి ఉంటాయని భావిస్తున్నారు. ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి కలప రవాణా జరుగుతుంది ఇదే క్రమంలో ఒకే పర్మిట్‌తో మూడు, నాలుగులోడులను అక్రమంగా తరలించుకుని కలప వ్యాపారులు, స్మగ్లర్లు వ్యాపారాలు చేయడం ఇక్కడ పరిపాటి అని పలువురు అంటున్నారు .ఇటువంటి పరిస్థితుల్లోనే పర్మిట్లు లేకుండా, అనధికారికంగా వాహనాల్లో కలప తరలించినప్పుడు, మలుపు వద్ద వాహనంలోంచి పడిపోయిఉంటాయని, వాటికోసం వేచిచూస్తే అసలు అక్రమం బయటపడుతుందనే భయంతో వాటిని వదిలేసి పారిపోయి ఉంటారని భావిస్తున్నారు. మండలంలో నుంచి విచ్చలవిడిగా కలప రవాణా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలకు రోడ్డుపై అడ్డుగోలుగా పడిఉన్న కలప దుంగలే నిదర్శనంగా ఉన్నాయనే ఆరోపణలూ ఉన్నాయి.. తక్షణమే సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు స్పందించి అక్రమ కలప రవాణాపై అడ్డుకట్ట వేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. మరికొన్ని దారి మళ్లించబడ్డాయి. 17267 కాకినాడ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 17268 విశాఖపట్నం - కాకినాడ ఎక్స్‌ప్రెస్, 07466 రాజమండ్రి - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 07467 విశాఖపట్నం - రాజమండ్రి ఎక్స్‌ప్రెస్, 17219 మచిలీపట్నం - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 17220 విశాఖపట్నం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్, 17239 గుంటూరు - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌లను నవంబర్ 13 నుంచి 19 వరకూ రద్దు చేశారు. 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్, 17240 విశాఖపట్నం - గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు, 22701 విశాఖపట్నం - విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 విజయవాడ - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నవంబర్ 13, 14, 15, 17, 18 తేదీల్లో రద్దు చేశారు. 22643 ఎర్నాకులం - పాట్నా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 13వ తేదీన, 12509 ఎస్ఎంవి బెంగళూరు - గౌహతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 15, 17న, 11019 సిఎస్‌టి ముంబయి - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 13, 15, 17, 18 తేదీల్లో సాధారణ మార్గం ఏలూరు, తాడేపల్లి గూడెం మీదుగా కాకుండా మళ్లించిన మార్గమైన విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు జంక్షన్ మీదుగా ప్రయాణిస్తాయి. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి అభ్యర్థించారు.

దేశ సమగ్రతకు దిక్సూచి యూత్ హాస్టల్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భిన్నత్వంలో ఏకత్వ భావన కల్పించడంలో యూత్ హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్ఎఐ) ముందంజలో ఉందని ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు, బీహార్ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అన్నారు. దేశం నలుమూలలా విభిన్న సాహస క్రీడలు నిర్వహిస్తూ ప్రజలందరినీ ఒక తాటిపై తీసుకురావడంలో వైహెచ్ఎఐ ముఖ్య భూమిక పోషిస్తోందని తెలిపారు. యూత్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్లాటినం జూబ్లీ వేడుకలను మంగళవారం దసపల్లా హోటల్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో మనం ఒక భాగం అనే విషయాన్ని యువత మర్చిపోరాదన్నారు.